# చరమగీతి

జనమంచి కామేశ్వరరావుగారు

భోజుని రాచనగరులో ఒకఆలయం. ఆఆలయంలోని దేవదాసి ఎక్కడోకొండకోనలో దొరకిన ఆడకూన. సంగీతజ్ఞుడు ఆచార్యుడు.

"ఒకనాటిప్రొద్దుపొడుపులో నవ్యనాదమొకటి నాచెవినిసోకింది. సజ్జపట్టుకొని పుష్పాపచయంకోసం నేనడవికిపోగా వటతరుచ్ఛాయక్రింద గోలుగోలున ఏడుస్తూ దొరికింది ఆపాప నాకు"అని చెప్పినాడు.

అప్పటినుండీ ఆపాపనెంతో అల్లారుముద్దుగా పెంచుతున్నాడు. ఆమె అతనిప్రియజంత్రము, తంబురాకన్న ప్రియతమమయింది. ఆమె నోటినుండి పలుకుకన్న పాటముందు విడివడి వెల్లివిరిసింది.

ఇప్పుడు ఆచార్యుని కంఠము రుద్ధమైపోయింది. దృష్టిమందగించింది. దత్తపుత్రిక ఆచార్యుణ్ణి చంటిపిల్లను చూసుకునేట్టు జాగ్రత్తగా చూసుకుంటూఉన్నది.

యువజనులు దూరదూరాలనుండి ఆమెపాట వినాలనివచ్చినారు. ఆచార్యుడు వీరినందరినిచూచినాడు. తొడిగిన మొగ్గవిడవడం, విడిచినమొగ్గ భువికి రాలిపోవడం అనేకాలధర్మం లోలోన మననంచేసుకున్నాడు. హృదయంలో కలగింపుపుట్టింది.

ఆమె "నిన్నువొదిలి ఒకగడియైనా ఉండగలనా? బాబూ!" అన్నది. ఆచార్యుడు ఆమాటలువినడంతోనే వెర్రిఆనందముతో ఆమె ముఖమూ, ముంగురులు ఆప్యాయంగా దువ్వాడు.

"నన్నువదిలి వెళ్ళిపోయిన గానపుతీపులు నీలోకుప్పవోసికున్నాయి. నాచిట్టి తల్లీ! నిన్నుపోనాడుకుంటే నాజీవితామూల్య భారమంతా వృధా సంకలితమై పోతుందే!" అన్నాడాయన.

ఫాల్గుణమాసము వాసంతిక భూదేవికుంతలాలను హైమస్విన్న సౌరభసుమాలతో తురిమింది. ఆరాత్రి కౌముదీస్నాపితము. ఆచార్యునిశిష్యులలో అగ్రగణ్యుడు కుమారసేనుడు గురువునకు ప్రణామముచేసి "మహాశయా! మాధవిహృదయం నేను చేదుకున్నాను. మీ అనుజ్ఞ అయితే మేము బద్ధులమగుతాము"అన్నాడు.

ఆచార్యుని కనుకొలకులలో బాష్పములు నిలిచాయి.

"నాతంబురా తెచ్చిపెట్టి మీరుభయులు నాఎదుట రాజ్ఞీరాజేశ్వరులలా కూర్చోండి" అన్నాడు. ఆచార్యుడు చేతితో తంబురాతీసికొని పాడమొదలుపెట్టినాడు.

"నేను నాజీవితాంతిమగీతి పాడుకుంటాను"అన్నాడు.

మొదటిచరణంపాడాడు. మరిముందుకు జరగలేదు ఆయనపాట. తంబూరాతీగలు వడగళ్లుపడితే వడకిపోయేపువ్వుల్లా వడవడ వడంకిపోయినాయి.

ఆఖరుకి తంబురా కుమారసేనునిచేతికందిచ్చి

"జంత్రము నీవుతీసికో ఇదిగో అన్నాడు."

తరువాత మాధవిచేయి కుమారసేనుని చేయిపై పెట్టి "ఇదిగో నాప్రాణంతీసికో" అంటూ "నేను మొదలు పెట్టి వదిలివేసిన పాటను మీ రుభయులు గొంతులుకలిపి సాంతముగాపాడండి" అన్నాడు. మాధవీకుమారసేనులు పాడమొదలుపెట్టినారు. రవిచంద్రులు కూడ కరగి వారిపాటలో చిన్న చిన్న గీతులై కలిసిపోయినాయి.

ఇంతలో రాజసేవకుడెవ్వడో వీధితలుపు తట్టినాడు నఖశిఖపర్యంతమూ కంపిల్లుచు ఆచార్యుడు లేచినిల్చొని "ఏమిటి రాజుగారిఆజ్ఞ?" అని అడిగినాడు.

సేవకుడు "ఏమిటా? మీకొమార్తెగారి నశీబు బాగుంది బాబు! రాజుగారెందుకో కబురంపారు" అన్నాడు.

ఆచార్యుడు "కబురంపారా? ఆ ఎందుకోసం?" అన్నాడు.

"రేపుప్రొద్దున్న రాజకుమారిగారు భర్తగారింటికి కాంభోజనగరంపయనమై వెళ్తారట. మీకొమార్తె ఆమెతో చెలికత్తెగా తోడు వెళ్లాలట! ఇది రాజుగారిఆజ్ఞ బాబు?" అన్నాడు సేవకుడు.

పొడుమలపయి ప్రొద్దుపొడిచింది. రాజకుమార్తె ప్రయాణమై బైల్దేరింది. రాణమ్మగారు మాధవితో "మాఅమ్మాయి ఎప్పుడూ నవ్వుతూ త్రుళ్లుతూ సుఖంగావుండేట్టుగా నీవు చూస్తూఉండాలి. అమ్మాయిని అక్రొత్తఇంట్లో జాగ్రత్తగా కనుపెట్టుకొని చూస్తూండాలి సుమా! జాగ్రత్త" అని చెప్పింది.

మాధవి కనుతుదలనుండి ఒకచినుకైనా కదలలేదు; సరికదా వెలుగురేఖ ఒకటి మెరసింది-గ్రీష్మభానుదీప్తికి ఆకాశంలో క్షణప్రభనిస్తూ మెరసే ఉజ్వలకిరణంలాగున.

ముందుగారాజకుమార్తె నెమిలిపాలకీ పోతూన్నది. పాలకీపై భాగమంతా ముఖమల్ గుడ్డ కప్పబడిఉన్నది. చుట్టూకవచధారులు, ఖడ్గపాణులు నడుస్తూఉన్నారు. మాధవిపాలకీ వెనకాలేవస్తూన్నది.

పథపార్శ్వమున ఆచార్యుడు నిర్జీవప్రతిమయి ధూళిపిహితమైనదేహంతో భూమీరుహంలా పడివున్నాడు. ఆతనిప్రక్క కుమారసేనుడు నిశ్శబ్దంగా నిట్టనిలువుగా అశ్వద్ధవృక్షంలా నిల్చునివున్నాడు.

పక్షులు పరిసరారణ్యములో కేరుకుంటున్నాయి. మందవాయువులు మావియిగుళ్ల సౌరభాలతో మత్తెక్కిపోతున్నాయి.

ఆమె పుట్టింటినిగురించి ఏఫాల్గుణమాసదివసాంతమందైన తలపోసికొనునేమో పాపము! అని మాతాపితలకు దూరమైపోయిన రాజకుమార్తెను తల్చుకుంటున్నారు రాజాంగణములోని ప్రజలు. —రవీంద్రుడు.